క్లుప్తంగా

మహాకుంభమేళాకు ప్రత్యేక బస్సులు

తుని: ఈ నెల 11న తుని ఆర్టీసీ డిపో నుంచి కుంభమేళా(ప్రయాగ్‌రాజ్)కు ప్రత్యేక స్లీపర్ బస్సు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ ఎస్.కిరణ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఈ యాత్రలో భక్తులు ప్రయాగరాజ్, కాశీ, గయ, బుద్ధగయ, శిరోగయా, అయోధ్య, సీతామడి, నైమిశారణ్యం, పూరి, కోణార్క్, భువనేశ్వర్ పుణ్యక్షేత్రాలను దర్శించుకొని ఈ నెల 21న తుని చేరుకుంటారన్నారు. ఒక్కొక్కరికీ టిక్కెట్టు ధర రూ.16,500గా నిర్ణయించామన్నారు. ఈ బస్సులో ప్రయాణికులకు ఉదయం, సాయంత్రం టిఫిన్, మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ నెల 18న 2 ప్లస్ 2 పుష్‌బ్యాక్ సీట్లతో మరో సూపర్‌లగ్జరీ బస్సు బయలు దేరుతుందన్నారు. దీని ధర రూ.12,500గా నిర్ణయించామన్నారు. పై బస్సులో సౌకర్యాలు ఈ బస్సులో కూడా ఉంటాయన్నారు. ఈ నెల 10న అరుణాచలం గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సు బయలు దేరుతుందని, భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల డిపో మేనేజర్ కిరణ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. టికెట్ల కోసం 73829 13216, 85550 58080, 73829 13016 నంబర్లను సంప్రదించాలని కోరారు.

వెల్‌నెస్ సెంటర్‌కు కుర్చీలు, బల్లల వితరణ



వెల్‌నెస్ సెంటర్‌కు బల్లలు అందజేస్తున్న రెడ్డి సంక్షేమ సంఘం ప్రతినిధులు

తుని రూరల్: మండలంలోని ఎస్.అన్నవరంలో ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం (వెల్‌నెస్ సెంటర్)కు వచ్చే రోగుల సౌకర్యార్థం తుని, పాయకరావుపేట రెడ్డి సంక్షేమ సంఘం 10 కుర్చీలు, రెండు బల్లలను అందజేసింది. శుక్రవారం ఆరోగ్య కేంద్రంలో సిబ్బందికి రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎం.వెంకటరాజారెడ్డి ఆధ్వర్యంలో కుర్చీలు, బల్లలను వితరణ చేశారు. కార్యక్రమంలో సంఘ సహాధ్యక్షుడు కె.నారాయణరెడ్డి, కార్యదర్శి కేవీ రామలింగారెడ్డి, గౌరవ అధ్యక్షులు కె.కిషోర్‌రెడ్డి, ఎస్.లక్ష్మీనారాయణ రెడ్డి, పి.శ్రీనివాసరెడ్డి, ఎం.వెంకటరెడ్డి, సంఘం ప్రతినిధులు, వెల్‌నెస్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత



భీమవరపుకోటలో బాధితురాలికి దుస్తులు అందిస్తున్న ఎస్సై రామకృష్ణ

కోటనందూరు: అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి స్థానిక ఎస్సై టి.రామకృష్ణ చేయూత అందించారు. మండలంలోని భీమవరపుకోట ఎస్సీ కాలనీలో బీజా సింహాచలానికి చెందిన తాటాకిల్లు ఇటీవల అగ్ని ప్రమాదానికి గురై రూ.3 లక్షల ఆస్తినష్టం వాటిల్లింది. విషయం తెలుసుకున్న ఎస్సై రామకృష్ణ శుక్రవారం భీమవరపుకోటలో బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రమాదానికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. బాధితులకు రూ.10 వేల విలువ చేసే వంట సామాన్లు, దుస్తులు, 50 కేజీల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భవానీ పాల్గొన్నారు.

జోరుగా రిజిస్ట్రేషన్లు



క్రయవిక్రయ దారులతో నిండిపోయిన ప్రత్తిపాడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

ప్రత్తిపాడు: రిజిస్ట్రేషన్ చార్జీలను ప్రభుత్వం పెంచేసింది. పెరిగిన చార్జీలు శనివారం నుంచి అమలు కానున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం ప్రత్తిపాడు సబ్‌రిజిస్టర్ కార్యాలయంలో భారీగా రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఈ కార్యాలయం పరిధిలో రోజుకు 35 క్రయవిక్రయ తదితర లావాదేవీలు జరిగేవి. కాగా శుక్రవారం ఒక్క రోజే 70 క్రయవిక్రయాలు జరిగినట్టు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది తెలిపారు. ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చార్జీలను ఫిబ్రవరి 1 నుంచి సుమారు 30 శాతం పెంచింది.

పోస్టు మాస్టర్ అకౌంట్‌లో పడిన జీతం

జగ్గంపేట: మండలంలోని కాట్రావులపల్లి బ్రాంచి పోస్టు మాస్టర్ ఇబ్బందులపై పత్రికల్లో వచ్చిన వార్తలకు అధికారులు స్పందించారు. శుక్రవారం ఉదయం కాట్రావులపల్లికి వచ్చిన పోస్టల్ అధికారి ఒకరు తనను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నట్లు బ్రాంచి పోస్టుమాస్టర్ దేవి తెలిపారు. పెండింగ్‌లో ఉన్న మూడు నెలల జీతం ఈ రోజు పడుతుందని ఆయన చెప్పినట్టుగానే మధ్యాహ్నానికి జీతం బ్యాంకు అకౌంట్‌లో పడిందని ఆమె వివరించారు. జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ తనను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, దీనిపై కేంద్ర మంత్రికి ఫిర్యాదు చేసినట్లు ఆమె మీడియాకు చెప్పిన విషయం తెలిసింది. కాగా తనకు సహకరించిన మీడియాకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

వెదజల్లు సాగు..లాభాలు బాగు

- తక్కువ పెట్టుబడి అధిక దిగుబడి
- రబీలో వరి పంటకు అనుకూలం
- మెట్టలో ఆసక్తి చూపుతున్న రైతులు



బెండపూడిలో వెదజల్లు పద్ధతిలో సాగు చేసిన వరి పంట



వెదజల్లు విధానంలో విత్తనాలు చల్లిన వరిచేను

తొండంగి: మెట్టప్రాంతమైన తుని నియోజకవర్గంలో రైతులు వెదజల్లు సాగుపై దృష్టి సారిస్తున్నారు. రబీలో ఈ విధానంలో నాట్లు వేయడం ఎంతో ఉత్తమమని అధికారులు సూచించడంతో రైతులు ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. సాగులో పెట్టుబడి ఖర్చు తగ్గుతుండటంతో క్రమంగా రైతులు వెదజల్లు పద్ధతిని అవలంబిస్తున్నారు.

సంప్రదాయ పద్ధతిలో పెరుగుతున్న ఖర్చు

ఖరీఫ్‌లో తొలకరి వర్షాలతో పాటు నీటి వసతులు ఎక్కువగా ఉంటాయి. కనుక రైతులు సంప్రదాయ పద్ధతిలో వరి సాగు చేస్తారు. రబీలో నీటి సదుపాయం తగ్గడంతో ఈ పద్ధతి అనుకూలంగా ఉండదు. సంప్రదాయ పద్ధతిలో ముందుగా నారుమడిని పెంచి నెల రోజుల తర్వాత కూలీలతో ఆకును లాగించి, నాట్లు వేయాలి. ఎకరాకు దాదాపు కూలీల ఖర్చు రూ.5 వేల వరకూ అవుతుంది. దీనికితోడు ఏటా కూలీల ఖర్చు పెరుగుతూ ఉంది. దీంతో పెటుబడి ఖర్చు తగ్గించుకునేందుకు రైతులు వెదజల్లు సాగుపై ఆసక్తి చూపుతున్నారు.

670 ఎకరాల్లో...

వెదజల్లు సాగులో వరిపొలాన్ని ట్రాక్టరుతో దమ్ము చేసిన అనంతరం దమ్ము మడిలో నీరు లేకుండా నేల హెచ్చుతగ్గులు లేకుండా సమాంతరంగా చదును చేయాల్సి ఉంటుంది. అనంతరం వరి విత్తనాలు నేరుగా నేలపై వేయడంతో క్రమంగా వరి మొక్కలు పెరిగి దుబ్బుగా మారుతుంది. వెదజల్లు విధానం వర్షాకాలంలో అనవుగా లేకపోవడంతో ఖరీఫ్‌లో సంప్రదాయ పద్ధతిలో రైతులు వరి సాగు చేస్తున్నారు. రబీలో కూలీల ఖర్చు లేకుండా పొలాన్ని దమ్ము చేసిన అనంతరం కొద్దిపాటి జాగ్రత్తలతో వెదజల్లు సాగు మంచి ఫలితాలు ఇస్తుండటంతో రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. వెదజల్లు విధానంలో సాగు చేస్తే ఎకరాకు రూ.5 నుంచి రూ.7 వేలు వరకూ పెట్టుబడి ఖర్చు తగ్గుతోంది. దీంతో రైతులు రబీలో క్రమంగా వెదజల్లు సాగుపైనే ఆసక్తి కనబరుస్తున్నారు. ముఖ్యంగా వ్యవసాయ బోర్లు పరిధిలోనూ, పీబీసీ పరిధిలో ఈ ఏడాది రబీలో దాదాపు 670 ఎకరాల్లో వెదజల్లు పద్ధతిలో వరిసాగు జరిగిందని మండల వ్యవసాయశాఖాధికారి ఎస్.నరసింహం తెలిపారు.

రెండేళ్లుగా వెదజల్లు పద్ధతిలోనే..



మాకున్న ఐదెకరాల పొలంలో రెండేళ్లుగా వెదజల్లు పద్ధతిలోనే వరి సాగు చేస్తున్నాను. ఈ ఏడాది రబీలో బీపీటీ సాధన రకం వేశాను. ఈ పద్ధతి వల్ల ఆకుమడి తయారీ, ఆకుతీత, ఊడుపు (వరినాట్లు వేయడం)ఖర్చులు లేవు. ఎరువుల వినియోగం కూడా తగ్గుతోంది. కూలీల ఖర్చు తగ్గడంతో పాటు పంట దిగుబడి 45 కాటాల వరకూ వస్తోంది.

–మద్దుకూరి సుధాకిరణ్, రైతు, బెండపూడి, తొండంగి మండలం

క్రమంగా సాగు విస్తీర్ణం పెరుగుతోంది



మండలంలో రైతులు వెదజల్లు సాగుపై ఆసక్తి చూపుతున్నారు. మెట్టలో ఏటా వెదజల్లు విధానంలోనే రైతులు రబీ వరి సాగు చేస్తారు. ఈసారి పల్లం చేలల్లో కూడా ఈ పద్ధతినే అవలంబిస్తున్నారు. దాదాపు 670 ఎకరాల్లో ఈ ఏడాది వెదజల్లు సాగు జరిగింది. ఈ విధానంలో కూలీల ఖర్చు, ఎరువుల వినియోగం తగ్గుతాయి. ఆరోగ్యకరమైన దిగుబడులు రావడంతో రైతులు మక్కువ చూపుతున్నారు.

– ఎస్.నరసింహం, మండల వ్యవసాయశాఖాధికారి, తొండంగి

అంతర్జాతీయ సదస్సులో విద్యార్థుల ప్రతిభ



ప్రశంసాపత్రాలు అందుకుంటున్న విద్యార్థులు

గండేపల్లి: కర్ణాటకలో జరిగిన అంతర్జాతీయ సదస్సులో ఆదిత్య విశ్వ విద్యాలయం విద్యార్థులు ప్రతిభ కనబరిచి ప్రథమ, తృతీయ స్థానాలను కై వసం చేసుకున్నట్టు యూనివర్సిటీ వ్యవసాయ విభాగాధిపతి బి.కృష్ణకాంత్ శుక్రవారం తెలిపారు. మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో వ్యవసాయ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన విద్యార్థులు కర్ణాటకలో దేవిహోసూరు, హవేరి హార్టికల్చర్ ఇంజినీరింగ్, ఫుడ్ టెక్నాలజీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. పోస్టర్ ప్రదర్శనలో ప్రథమస్థానం, మౌఖిక ప్రదర్శనలో తృతీయ స్థానాలు గెలుచుకున్నట్టు పేర్కొన్నారు. విజేతలు వేదాంతం సాయికృష్ణ, ఎం.మారుతి కుమార్, జె. లహరికి సూర్యసాయి, డి.దాక్షాయణిలను ఆదిత్య యూనివర్సిటీ ప్రో చాన్సలర్ ఎస్.సతీష్ రెడ్డి, డిప్యూటీ చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి తదితరులు అభినందించారు.

ప్రజలకు సేవ చేయడమే లక్ష్యం

- మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నేత ముద్రగడ పద్మనాభం
- ఒమ్మంగిలో పార్టీ శ్రేణులతో ఆత్మీయ సమావేశం



ఒమ్మంగిలో వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలిసి ర్యాలీ చేస్తున్న ముద్రగడ పద్మనాభం, గిరిబాబు

ప్రత్తిపాడు రూరల్: ఫలితం ఆశించకుండా నిస్వార్థంగా ప్రజలకు సేవ చేయడమే తమ లక్ష్యమని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నేత ముద్రగడ పద్మనాభం అన్నారు. మండలంలోని ఒమ్మంగిలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రామిశెట్టి బులిరామకృష్ణ ఇంటి వద్ద శుక్రవారం వైఎస్సార్ సీపీ శ్రేణులతో ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముద్రగడ గిరిబాబు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్‌గా నియమితులైన తర్వాత తొలిసారిగా తన తండ్రి, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభంతో కలిసి పార్టీ శ్రేణులతో గ్రామంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. గ్రామంలోని పార్టీ శ్రేణులు వారికి ఘన స్వాగతం పలికారు. మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం తన కుమారుడిని అందరికీ పరిచయం చేసి ఆశీర్వదించాలని కోరారు. అక్కడ నుంచి పార్టీ శ్రేణులు, అభిమానులతో కలిసి ర్యాలీగా మూడు రోడ్ల కూడలికి చేరుకున్నారు. అక్కడ అంబేడ్కర్, వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం మాట్లాడుతూ తనను, తన తండ్రి ముద్రగడ వీరరాఘవరావును ప్రత్తిపాడు నియోజకవర్గ ప్రజలు ఎంతగానో ఆదరించారన్నారు. అలాగే తన కుమారుడు గిరిబాబును ఆదరించి ఈ ప్రాంత అభివృద్ధికి తోడ్పాటును అందించాలన్నారు. ముద్రగడ గిరిబాబు మాట్లాడుతూ రైతులు సాగునీటి కోసం పడుతున్న ఇబ్బందులను గుర్తించి తన తాత, తండ్రి ఈ మండలంలో రెండు సాగునీటి ప్రాజెక్టులు నిర్మించారని తెలిపారు. ఫలితంగా వేలాది ఎకరాల బీడు భూములు సాగులోకి వచ్చాయన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మళ్లీ అధికారం చేపట్టేలా పార్టీ శ్రేణులు కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, దొరబాబు, ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీను, వైఎస్సార్ సీపీ నాయకులు జల్లిగంపల ప్రభాకర్‌రావు, గుడాల వెంకటరత్నం, శిగడం వెంకటేశ్వరావు, గొల్లపల్ల కాశీ, బదిరెడ్డి గోవింద్, దోళ చిట్టిబాబు, గొనగాల అప్పలరాజు, కొట్టేటి రాయుడు, దాడిశెట్టి చక్రధర్, ఉమ్మిడి తాతీలు, నడిగట్ల త్రీమూర్తులు, మేడసాని సింహాద్రి, రేఖా శ్రీను, జువ్విన వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.



పార్టీ శ్రేణలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ముద్రగడ గిరిబాబు, చిత్రంలో మాజీ మంత్రి పద్మనాభం

భక్తిశ్రద్ధలతో వాసవీమాత ఆత్మార్పణ



ఏలేశ్వరంలో వాసవీమాతకు ప్రత్యేక పూజలు చేస్తున్న ఆర్యవైశ్యులు

జగ్గంపేట: స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద వేంచేసిన కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం వాసవీ మాత ఆత్మార్పణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పండితుడు మామిళ్లపల్లి రామకృష్ణ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం, వాసవీ క్లబ్ పర్యవేక్షణలో అమ్మవారికి ఉదయం పంచామృతాభిషేకం, గణపతి పూజ, నవగ్రహ శాంతి హోమం, పూర్ణాహుతి, లలితా సహస్రనామం పారాయణ నిర్వహించారు. అనంతరం 108 మహిళలతో దీపారాధన చేశారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సతీమణి జ్యోతుల మణి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్, రాష్ట్ర ఆర్య వైశ్య వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఆర్య వైశ్య సంఘం నేతలు పాల్గొన్నారు.

వాసవీమాతకు ప్రత్యేక పూజలు

కిర్లంపూడి: గ్రామంలో వాసవీకన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మర్పణ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చనలు నిర్వహించారు. మహిళా భక్తులు సామూహిక లలితాసహస్రనామ పారాయణ చేశారు. స్థానిక, పరసర గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఏలేశ్వరం: పట్టణంలో శుక్రవారం వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం ఘనంగా జరిగింది. వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో వాసవీ మాతకు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పట్టణంలో ప్రమిదలతో నగర సంకీర్తన నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

మట్టి అక్రమ తవ్వకాల నిలిపివేత



కోదాడలో చెరువులో మట్టి తవ్వకాలు

తొండంగి: కూటమి నేతల అండదండలతో అక్రమంగా చెరువు మట్టిని తరలిస్తుండటంపై ఫిర్యాదు అందడంతో అధికారులు చర్యలు తీసుకున్నారు. మండలంలోని కొత్తకోదాడ-కోదాడ కాలనీ గ్రామాలకు మధ్యలో ఉన్న చెరువులో మట్టిని కూటమి నేతల అండతో కొంతమంది జేసీబీతో తవ్వి ట్రాక్టర్లపై అక్రమంగా తరలిస్తున్నారు. దీనిపై పంచాయతీ సర్పంచ్ తహసీల్దార్ మురార్జీకి ఫిర్యాదు చేయగా తక్షణమే మట్టి తవ్వకాలను నిలిపివేయాలని వీఆర్వోను ఆదేశించారు. దీంతో మట్టి తవ్వకాలను నిలిపివేశారు.

ఫిజియోథెరపీపై అవగాహన

ప్రత్తిపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఫిజియోథెరపీ శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు ప్రారంభించారు. విశాఖ నిజామ్ సంస్థ ఆంధ్ర, తెలంగాణ కోఆర్డినేటర్ రమేష్, డాక్టర్ సంతోష్ ఫిజియోథెరఫీపై అవగాహన కల్పించారు. సుమారు 100 మంది సచివాలయ, ఉపాధిహామీ పథకం, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

భీష్మ ఏకాదశికి పటిష్ట ఏర్పాట్లు

- రత్నగిరిపై దేవస్థానం, పోలీస్‌శాఖల సమన్వయ సమావేశంలో నిర్ణయం

అన్నవరం: మాఘమాసంలో అత్యంత పవిత్రమైన భీష్మ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఈ నెల 8న సత్యదేవుని దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా విస్తృత ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. భీష్మ ఏకాదశి, శనివారం కలిసి రావడంతో ఆలయానికి భారీ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో దేవస్థానంలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై శుక్రవారం దేవస్థానం, పోలీస్ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ ముఖ్య అతిథిగా హాజరైన సమావేశంలో దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు, పెద్దాపురం డీఎస్పీ శ్రీహరి రాజు, ప్రత్తిపాడు సీఐ సూర్య అప్పారావు, అన్నవరం ఎస్ఐ శ్రీహరి బాబు, పలువురు దేవస్థానం అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు

భీష్మ ఏకాదశి ముందు రోజు సాయంత్రం నుంచే భక్తులు రత్నగిరికి తరలి వస్తారు. కావున ఆ రోజు నుంచి ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. ముందు రోజు అర్ధరాత్రి నుంచి సత్యదేవుని వ్రతాల నిర్వహణ, స్వామివారి దర్శనానికి ఏర్పాట్లు చేస్తారు.

- క్యూలైన్లలో భక్తులకు మంచినీరు, చిన్నారులకు పాలు, బిస్కెట్లు అందిస్తారు. మంచినీటి సరఫరా కోసం స్వచ్ఛంద సంస్థల సేవలను వినియోగించుకుంటారు.
- ప్రసాదాల విక్రయాలకు అదనపు కౌంటర్లు ఏర్పాటు చేయాలని, ఘాట్‌రోడ్‌లో ట్రాఫిక్ జామ్ అవ్వకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

భీష్మ ఏకాదశి రోజు ఉదయం 8 గంటల నుంచి సర్క్యులర్ మండపం వద్ద భక్తులకు దద్దోజనం, పులిహోర పంపిణీ చేయనున్నారు.

- వసతి గదులు లభించని భక్తులు విశ్రాంతి మండపాల్లో విశ్రాంతి తీసునేందుకు ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు.
- దేవస్థానంలో పలు చోట్ల అదనపు టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.
- కార్తికమాసంలో భక్తులకు ఇబ్బంది కలుగకుండా క్యూలైన్లలో కంపార్ట్‌మెంట్‌లు ఏర్పాటు చేసినట్టే ఇప్పుడు కూడా భక్తుల కోసం కంపార్ట్‌మెంట్లు ఏర్పాటు చేయనున్నారు.
- రత్నగిరి, సత్యగిరుల మధ్య భక్తుల కోసం ఉచిత బస్సులు నడపాలని నిర్ణయించారు.

భక్తుల వాహనాలను ప్రకాష్ సత్రం వెనుక, సత్యగిరి దిగువన గల పార్కింగ్ స్థలాల్లో, సత్యగిరిపై హరిహరసదన్ పార్కింగ్ స్థలంలో నిలిపివేయాలని నిర్ణయించారు.

- జిల్లా వైద్యశాఖ, దేవస్థానం ఉచిత వైద్యశాల సిబ్బంది సహకారంతో దేవస్థానంలో మూడు చోట్ల మెడికల్ క్యాంపులు నిర్వహించాలని నిర్ణయించారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా పలు నిర్ణయాలు తీసుకున్నారు.



సమావేశంలో పాల్గొన్న దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ సుబ్బారావు, డీఎస్పీ శ్రీహరి రాజు

ఎన్నికల ప్రవర్తన నియమావళిని పాటించాలి



ఎమ్మెల్సీ ఎన్నికపై వివిధ పార్టీల నాయకులతో సమీక్షిస్తున్న తహసీల్దార్ సూర్యప్రభ

ప్రత్తిపాడు: ఉభయగోదావరి జిల్లా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని, రాజకీయ నాయకులు ఎన్నికల ప్రవర్తన నియమావళిని పాటించాలని తహసీల్దార్ ఎం.సూర్యప్రభ సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫిబ్రవరి 3 నుంచి 10 వరకు నామినేషన్లను స్వీకరణ, 11న నామినేషన్ల పరిశీలన, 12, 13 తేదీల్లో నామినేషన్ల ఉపసంహరణ, 27న పోలింగ్ నిర్వహిస్తారని చెప్పారు. మండలంలో 1242 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకుడు శేరు కృష్ణ, సింగిలిదేవి సత్తిరాజు (బీజేపీ), ధర్నాలకోట శ్రీను (కాంగ్రెస్), కొండపల్లి శ్రీనివాస్ (టీడీపీ), మానుకొండ లచ్చబాబు (లిబిరేషన్), మోర్త వీరబాబు(జనసేన) తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలు పరిశీలన

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు మండలంలో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. స్థానిక మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాల్లో ఏర్పాటు చేయనున్న రెండు పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ ఎం.సూర్యప్రభ పరిశీలించారు. ఆమె వెంట ఎంపీడీఓ కార్యాలయ పరిపాలనాధికారి జె.శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఏలేరు జలాశయంలో చేపపిల్లలు విడుదల



సమావేశంలో మాట్లాడుతున్న మత్స్యశాఖ జిల్లా అధికారి కరుణాకరరావు

ఏలేశ్వరం: స్థానిక ఏలేరు జలాశయంలో శుక్రవారం పెంపకం నిమిత్తం చేపపిల్లలు వదిలాదు. ప్రధాన మంత్రి మత్స్యసంపద యోజనలో భాగంగా సుమారు 1.38 లక్షల చేపపిల్లలను స్థానిక ఏలేరు ప్రాజెక్టులో వదిలిపెట్టారు. ఈ సందర్భంగా జిల్లా మత్స్యశాఖ అధికారి కె.కరణాకరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. మత్స్యకారుల ఉపాధి నిమిత్తం ఏలేరు ప్రాజెక్టులో చేపపిల్లలను పెంచుతున్నట్టు తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌డీఓ ఉప్పాడ శ్రీరామకృష్ణ, ఇన్‌స్పెక్టర్ రాజేంద్రరావు, సిబ్బంది శ్రీనుబాబు, అచ్చిరాజు, సునీత, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గద్దర్ జయంతి వేడుకలు



ఏలేశ్వరంలో గద్దర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దళిత నాయకులు

ఏలేశ్వరం: ప్రజాగాయకుడు గద్దర్ జయంతి వేడుకలను పట్టణంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక క్వారీ కార్మికుల యూనియన్ కార్యాలయంలో గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గద్దర్ తన పోరాటాలతో ప్రజలను ఉత్తేజపరిచారన్నారు. గద్దర్‌ను నేటియువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు కుప్పాల నాగభూషణం, బత్తిన శ్రీనివాస్, నూకతాటి సతీష్, రాయుడు చిన్నా, పేకల జాన్, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

దేవీచౌక్ ఆలయంలో ప్రత్యేక పూజలు



దేవీచౌక్ కనకదుర్గమ్మకు పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు శ్రీనివాస్‌శర్మ

గోకవరం: గ్రామంలో ప్రసిద్ధిగాంచిన దేవీచౌక్ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీశ్యామల నవరాత్రుల్లో భాగంగా రెండో రోజు ఆలయ ప్రధాన అర్చకులు డాక్టర్ వల్లూరి జగన్నాథశర్మ, శ్రీనివాస్‌శర్మ అమ్మవారిని మాతంగి రాజశ్యామలదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు మాతంగి రాజశ్యామలాదేవి అలంకారంలోని కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్‌రావు సహకారంతో ప్రసాద వితరణ చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



ప్రత్తిపాడులో హైవే సెఫ్టీ వాహనాన్ని ఢీకొన్న కారు

ప్రత్తిపాడు: జాతీయ రహదారిపై స్థానిక పాదాలమ్మ ఆలయ సమీపంలో శుక్రవారం జరిగిన ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. అన్నవరం నుంచి దుర్గానారాయణ, అన్నపూర్ణయ్య రాజమహేంద్రవరం వైపు కారులో వెళుతున్నారు. హైవే సేఫ్టీ వాహనాన్ని ఢీకొట్టడంతో వీరిద్దరూ గాయపడ్డారు. క్షతగాత్రులను హైవే అంబులెన్సులో ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. దీనిపై కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.

ఇబ్బంది కలిగిస్తే సమాచారం ఇవ్వండి



జగ్గంపేట నెహ్రూకాలనీలో పర్యటించి స్థానికులకు విజిటింగ్ కార్డులు ఇస్తున్న సీఐ శ్రీనివాస్

జగ్గంపేట: గ్రామాల్లో ఎవరైనా పబ్లిక్ న్యూసెన్స్‌కు పాల్పడినా, బాలికలు, మహిళలను ఇబ్బందులకు గురి చేసినా తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలని జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ సూచించారు. జగ్గంపేటలోని నెహ్రూ కాలనీతో పాటు పలు ప్రాంతాల్లో ఎస్సై రఘునాథరావు, పోలీసు సిబ్బందితో కలిసి ఆయన పర్యటించారు. స్థానిక యువకులు, మహిళలతో మాట్లాడారు. రాత్రి సమయంలో కాలనీల్లో ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతున్నా, బహిరంగంగా మద్యం సేవించినా తమకి సమాచారం ఇవ్వాలన్నారు. యువకులు మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారని, అటువంటి వారి సమాచారం అందజేయాలని కోరారు.